క్లుప్తంగా

బాలల సంరక్షణ గృహానికి నిందితుడు

కంబాలచెరువు: వీరభద్రపురంలో ఈ నెల 24వ తేదీన జరిగిన కిలారి పోతురాజు హత్య ఘటనలో నిందితుడు మైనర్ కావడంతో అతడిని సోమవారం అదుపులోకి తీసుకుని, న్యాయమూర్తి ఆదేశాల మేరకు బాలల సంరక్షణ గృహానికి తరలించారు. పోతురాజు హత్యపై మూడో సీఐ వి.అప్పారావు దర్యాప్తు చేసి, బాలుడిని నిందుతుడిగా గుర్తించారు. అతడి కుటుంబానికి, పోతురాజు కుటుంబానికి చాలాకాలం పరిచయం ఉంది. తన తల్లితో అనుచితంగా ఉంటాడనే కక్షతో ఈ హత్య చేసినట్లు తెలుస్తోంది. పోలీసుల దర్యాప్తులో ప్రాథమికంగా వివరాలు సేకరించారు. హత్య జరిగిన రోజు ఈ బాలుడు పోతురాజుకు ఫోన్ చేసి రప్పించి వీరభద్రపురంలో మాట్లాడినట్లు తెలుస్తోంది. ఆ బాలుడు పరిచయస్తుడే కావడంతో పోతురాజు అతడిని తన వాహనంపై ఎక్కించుకుని వెళుతుండగా వెనుక కూర్చున్న బాలుడు కత్తితో పొడిచాడు. తీవ్ర గాయంతో కిందపడిన అతడి మెడపై కోసినట్లు దర్యాప్తులో తెలిసింది. ఈ హత్యకు ప్రధాన కారణం వివాహేతర సంబంధమేనని పోలీసులు చెబుతున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

కడియం: మండలం కేంద్రమైన కడియంలో సోమవారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ తదితరులు ఉన్నారు.

మెడికల్ షాపుల్లో చోరీ

కడియం: జేగురుపాడులోని రెండు మెడికల్ షాపులలో ఆదివారం రాత్రి చోరీలు జరిగాయి. జి.సతీష్ ఆదివారం రాత్రి తన షాపును మూసి ఇంటికి వెళ్లాడు. సోమవారం వచ్చి చూసేసరికి తాళాలు బద్దలు కొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూస్తే షాపులోని రూ.2 లక్షలు మాయమైనట్లు గుర్తించాడు. దీంతో పోలీసులను ఆశ్రయించగా, క్లూస్‌టీమ్ వచ్చి వివరాలు సేకరించింది. అదే గ్రామంలోని మరో షాపులో రెండు సెల్‌ఫోన్లను దొంగిలించారు.

యువకుడి ఆత్మహత్య

రాజమహేంద్రవరం రూరల్: మద్యానికి బానిసైన ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. హుకుంపేట డి బ్లాకుకు చెందిన నేదునూరి సంతోష్ కుమార్ (25) మద్యానికి బానిసయ్యాడు. అతడికి భార్య లీలాకుమారి, అబ్బాయి, అమ్మాయి ఉన్నారు. ప్రతి రోజు మద్యం తాగి భార్యను కొడుతూ ఉంటాడు. ఏమైందో తెలియదు గానీ సోమవారం మధ్యాహ్నం అతడి భార్య కుమారుడికి బయట భోజనం తినిపిస్తున్న సమయంలో ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు కిందకు దించినప్పటికీ అప్పటికే మృతి చెందాడు. అతడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై ఆర్.అంకారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోపాలకృష్ణకు అభినందన



గోపాలకృష్ణను అభినందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్: ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ద్వారా మాస్టార్ ట్రైనర్ ఓబిలిశెట్టి గోపాలకృష్ణ వెయ్యి మంది రైతులకు కషాయాలు, ద్రావణాలు ఇచ్చి సేంద్రియ వ్యవసాయంలో సహకరించినందుకు జైవిక్ అవార్డు రావడం అభినందనీయమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయనను తన చాంబర్‌లో అభినందించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.మాధవరావు, డీపీఎం తాతారావు పాల్గొన్నారు.

రాజయోనాకు సత్కారం



రాజయోనాను అభినందిస్తున్న మైసూరు సంస్థాన రాజు వడయార్

రాజమహేంద్రవరం రూరల్: ఫిలాంత్రోఫిక్ సొసైటీ అధ్యక్షుడు అద్దంకి రాజాయోనాను మైసూరు సంస్థాన మహారాజు, మైసూరు పార్లమెంట్ సభ్యులు యదువీర్ కృష్ణదత్త చామరాజ వడయార్ సత్కరించారు. మైసూరు రాజప్యాలస్‌లోని ఆయన కార్యాలయంలో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. ఇటీవల కర్ణాటకకు చెందిన టుంకూరు యూనివర్సిటీలోని కన్నడ అసోసియేషన్ నుంచి ప్రతిష్టాత్మక సోషల్ ఇంపాక్ట్ 2025అవార్డును రాజయోనా పొందిన సందర్భంగా ఆయనను అభినందించారు.

నిర్ణీత సమయంలో అర్జీలకు పరిష్కారం

సీటీఆర్ఐ: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ – మీకోసం కార్యక్రమానికి ప్రజలు వివిధ సమస్యపై ఎనిమిది అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో కృష్ణ నాయక్ మాట్లాడుతూ ప్రతి అర్జీని నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామన్నారు.

▸▸ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు ప్రజలు 17 అర్జీలు అందించారు. కమిషనర్ తరఫున నగరపాలక సంస్థ ఇన్‌చార్జి అదనపు కమిషనర్ ఎస్.వెంకటరమణ, నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ వినూత్న స్వీకరించారు.

దొంగా దొంగ..



మోటారు వైర్ల చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న దుళ్ల రైతులు

- నర్సరీల్లో విద్యుత్ మోటార్ల వైర్లు మాయం
- వరసగా ఐదు గ్రామాల్లో చోరీలు
- ఆందోళనలో రైతులు
- పోలీసులకు ఫిర్యాదు

కడియం: మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్ మోటార్ల వైర్లను దొంగలు కత్తిరించి పట్టుకుపోతున్నారు. వీటితో పాటు విద్యుత్ మోటార్లు, సోలార్ పానల్స్ వైర్లు, సోలార్ స్టార్టర్లను సైతం మాయం చేస్తున్నారు. దీంతో నర్సరీ గగ్గోలు పెడుతున్నారు. గత ఐదు రోజుల వ్యవధిలో కడియపులంక, పొట్టిలంక, దుళ్ల, జేగురుపాడు, కడియం గ్రామాల్లో వరుస పెట్టి ఈ వైర్ల చోరీలు జరుగుతున్నాయి. పలు చోట్ల రైతులు పహారా కాస్తున్నప్పటికీ, ఏదో ఒక మూల ఈ వైర్ల చోరీలు కొనసాగుతున్నాయి.

రూ.లక్షల్లో నష్టం

దుళ్ల గ్రామానికి చుట్టుపక్కల ఉన్న పుంత రోడ్లలో కేవలం పది రోజుల వ్యవధిలోనే దాదాపు 120 మంది రైతులకు సంబంధించిన వైర్లు మాయమయ్యాయి. ఇందులో కొందరు రైతులకు చెందిన వైర్లను మూడేసి సార్లు కూడా కోసేశారు. వీటిని తిరిగి ఏర్పాటు చేసుకునేందుకు ఒక్కో రైతుకు సుమారు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకూ ఖర్చవుతోంది. ఈ లెక్కన వైర్ల చోరీ కారణంగా రైతులందరికీ కలిపి రూ.ఆరు లక్షల మేర నష్టం వాటిల్లిందని చెబుతున్నారు.

పహారా పెంచుతాం

> చోరీలు జరుగుతున్న ప్రాంతాలలో పోలీసు పహారా పెంచుతాం. ఇప్పటికే పలు బీట్లను ఏర్పాటు చేశాం, ఇంకా సిబ్బందిని వినియోగిస్తాం. అలాగే రైతులు కూడా గుర్తించిన ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావాలి. తద్వారా దర్యాప్తు వేగంగా సాగేందుకు అవకాశం ఉంటుంది.
>
> – ఎ.వెంకటేశ్వరరావు, పోలీస్ ఇన్‌స్పెక్టర్, కడియం

అదనపు ఖర్చు

దొంగలు ముఖ్యంగా సబ్ మెర్సిబుల్ మోటారు వైర్లు కత్తిరించుకుపోతున్నారు. వీటికి మళ్లీ వైర్లను అతికించేందుకు బోరులో నుంచి ఈ మోటార్‌ను పైకి తీసుకురావాలి. దీనికి రైతులకు తలకుమించిన భారం అవుతోంది. దాదాపు పది మంది వరకూ సాయం పడితే తప్ప గొట్టంలోంచి సబ్ మెర్సిబుల్ మోటారును పైకి తీసుకురాలేకపోతున్నారు. ఇవన్నీ రైతులకు అదనపు భారాలుగా మారుతున్నాయి. ప్రస్తుతం సాగు చేస్తున్న వారిలో అత్యధిక శాతం మంది కౌలుదారులే. వ్యవసాయాదాయం అంతంత మాత్రంగానే ఉంటున్న నేపథ్యంలో ఇలా చోరీల కారణంగా అదనపు పెట్టుబడులు పెట్టాల్సి రావడం రైతులను మరింత ఆవేదనకు గురి చేస్తోంది.

పోలీసులకు మొర

దుళ్ల గ్రామంలో వైర్లు పదేపదే చోరీకి గురవుతుండడంతో రైతులు సోమవారం కడియం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పదే పదే వైర్లు పోతుండడంతో సాగుకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని వాపోయారు. పలువురు అనుమానితుల పేర్లను కూడా పోలీసులకు అందజేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సౌత్‌జోన్ డీఎస్పీ భవ్య కిషోర్‌ను సత్కరిస్తున్న సర్పంచ్ స్టాలిన్ తదితరులు

కడియం: సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సౌత్ జోన్ డీఎస్పీ భవ్య కిషోర్ అన్నారు. జేగురుపాడు పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, మాదక ద్రవ్యాలు, సీసీ కెమెరాలు, ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా ఫలానా బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నాం, మీ మొబైల్‌కు వచ్చిన ఓటీపీ చెప్పండి అంటే నమ్మవద్దన్నారు. మన ఓటీపీ నంబర్లు అస్సలు బయట వారికి చెప్పకూడదన్నారు. ప్రధాన కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, నేరాల నిరోధానికి ఇవి ఎంతో తోడ్పడతాయన్నారు. ఎవరైనా ఊళ్లకు వెళ్లినట్లయితే ముందుగా పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని, వారి ఇంటి భద్రత కోసం ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ద్విచక్ర వాహనాలపై ట్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయరాదన్నారు. మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని డీఎస్పీ సూచించారు. కార్యక్రమంలో కడియం ఎస్సై ధనలక్ష్మీ ప్రసన్న, సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, ఉప సర్పంచ్ పాతూరి రాజేష్, ఎంపీటీసీ నాగిరెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన రిపబ్లిక్ డే వేడుకలు



వివిధ రాష్ట్రాల వేషధారణలో అలరించిన విద్యార్థులు

కడియం: కడియంలోని శ్రీషిర్డిసాయి విద్యానికేతన్ పాఠశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా ముగిసాయి. ఈ నెల 22 నుంచి పాఠశాలలో వివిధ తరగతులకు దేశంలోని రాష్ట్రాలకు సంబంధించిన నమూనాలను ఇవ్వడం జరిగింది. దీనికి అనుగుణంగా పాఠశాల విద్యార్థులు గణతంత్ర వేడుకలు జరుపుకొన్నారు. దీనిలో భాగంగా తరగతి గదులను ఆయా రాష్ట్రాల నమూనాలుగా అలంకరించి, అన్ని రాష్ట్రాలకు సంబంధించిన సంస్కృతులు, ఆచార వ్యవహారాలు, ఆహార పదార్థాలు, సాంస్కృతిక నృత్యాలు, పలు ప్రదర్శనలతో అలరించారు. ఆదివారం పాఠశాల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ జాతీయపతాకాన్ని ఆవిష్కరించి విద్యార్థులకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో విద్యార్థులందరూ రాష్ట్రాల వారీగా ప్రదర్శించిన నృత్యరూపకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బీబీఎస్‌ఈ కరిక్యులమ్‌లో ఈ విధమైన ప్రాజెక్టులు, ప్రదర్శనలు చేయడం వల్ల విద్యార్థుల్లో దేశభక్తి పెరుగుతుందని పాఠశాల డైరెక్టర్ టి.శ్రీవిద్య తెలిపారు. కార్యక్రమంలో షిర్డిసాయి జూనియర్ కాలేజీ డైరెక్టర్ టి.శ్రీలేఖ, డాఫ్నీ సివిల్స్ అకాడమి డీన్ శ్రీఐశ్వర్య పాల్గొన్నారు.

నారాయణ విద్యాసంస్థలను సీజ్ చేయాలి

- పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్ఐ సంఘాల ధర్నా
- ఇంటర్ ఆర్జేడీకి వినతిపత్రం అందజేత



ఆర్‌జేడీ శారదకు వినతి పత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ నాయకులు

కంబాలచెరువు: అనంతపురం నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి చరణ్ మృతికి కారణమైన నారాయణ సంస్థలను సీజ్ చేయాలని, విద్యార్థి చావుకు నైతిక బాధ్యత వహిస్తూ నారాయణను మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ఇంటర్మీడియట్ ఆర్‌జేడీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఆర్‌జేడీ శారదకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా మాట్లాడుతూ విద్యార్థి చావుకు కారణమైన నారాయణ కళాశాల యాజమాన్యాల పైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే వందల మంది విద్యార్థులు చనిపోయినప్పటికీ ఏ జిల్లాలో కూడా నారాయణ విద్యాసంస్థలపై కేసు నమోదు కాలేదన్నారు. అక్కడ ఫీజుల నియంత్రణ కూడా లేదన్నారు. నారాయణ విద్యాసంస్థలను సీజ్ చేయకుంటే ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలకు శ్రీకారం చుడతామన్నారు. అవసరమైతే త్వరలో నారాయణ విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వై.భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.కనక, సహాయ కార్యదర్శి కె.జ్యోతిర్మయి, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.భాను ప్రసాద్, సిటీ కార్యదర్శి దినేష్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌పై సమావేశం



న్యాయమూర్తులతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు: జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత సోమవారం వివిధ బీమా సంస్థల ప్రతినిధులు, న్యాయవాదులు, కక్షిదారులతో సమావేశమయ్యారు. మార్చి 8వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక మొత్తంలో మోటారు వాహనాల ప్రమాద కేసులు పరిష్కరించేందుకు, బాధితులకు తగు పరిహారం అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. మోటారు వాహనాల ప్రమాదం కేసులను గుర్తించి ఆ జాబితాను జిల్లా న్యాయసేవాధికార సంస్థకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాశ్‌బాబు, గవర్నమెంట్ ప్లీడర్ వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సదస్సు

స్థానిక విక్రం హాలులో అసంఘటిత రంగంలోని కార్మికులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. నల్సా అసంఘటిత కార్మికులకు న్యాయ సేవల పథకం 2015 ద్వారా అందిస్తున్న సేవలను, వివిధ పథకాలను వివరించారు. అసంఘటిత కార్మికులందరూ ఈ శ్రమ్ పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

మనో కాలుష్యాన్ని హరించేది ఆలయం

రాజమహేంద్రవరం రూరల్: మనో కాలుష్యాన్ని హరించేది ఆలయమని ప్రముఖ ఆధ్యాత్మిక వక్త భారతీయం సత్యవాణి అన్నారు. బొమ్మూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో తిరుకల్యాణ మహోత్సవం సందర్భంగా సోమవారం రాత్రి ఆమె ఆధ్మాత్మిక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ఆలయాల ప్రాశస్త్యాన్ని వివరించారు. ముందుగా సత్యవాణికి ఆలయ ధర్మకర్త కామిని ప్రసాద్ చౌదరి, లక్ష్మి దంపతులు స్వాగతం పలికారు.

రామకృష్ణకు సేవా పురస్కారం



రామకృష్ణకు ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్

సీటీఆర్ఐ: కాతేరు గామన్ ఇండియా బ్రిడ్జి వద్ద ఈ నెల 22వ తేదీ రాత్రి కావేరీ బస్సు తిరగబడిన ఘనటలో ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన గూడూరి రామకృష్ణకు సేవా ప్రశంసాపత్రం లభించింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారం అందుకున్నారు. ప్రమాదం జరిగిన రాత్రి రామకృష్ణ విజయవాడ నుంచి రాజమహేంద్రవరం వస్తున్నారు. తన కళ్లెదుట బస్సు ప్రమాదం జరగడంతో వెంటనే స్పందించి బాధితులను కాపాడారు.

నగరపాలక సంస్థ సెక్రటరీగా శైలజావల్లి

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ సెక్రటరీగా శైలజావల్లిని నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు ఆమె రాజమహేంద్రవరం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ సెక్రటరీగా విధులు పనిచేశారు. ఆమె స్థానంలో రుడా సెక్రటరీగా మంగళగిరి నుంచి వెంకటరత్న సాయిబాబా మద్దిపాటిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఘనంగా పెన్షనర్ల వ్యవస్థాపక దినోత్సవం



పల్లా సత్యనారాయణమూర్తి తదితరులను సన్మానించిన పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

ధవళేశ్వరం: ఆంధ్రప్రదేశ్ స్టేట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ధవళేశ్వరం శాఖ బలోపేతానికి కృషి చేయాలని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పల్లా సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. ధవళేశ్వరం శాఖ వ్యవస్థాపక దినోత్సవాన్ని సీనియర్ నాయకుడు యరమ్రోతు ధర్మరాజు అధ్యక్షతన సంఘ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ సంఘంలో సుమారు 250 మంది సభ్యులు ఉన్నారని, అంతా ఒకే కుటుంబంగా కలిసి మెలిసి ఉంటామన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా అధ్యక్షుడు పల్లా సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ధవళేశ్వరంలో పదవీ విరమణ చేసిన వారందరినీ సభ్యులుగా చేర్పించాలని, సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని, దానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. క్లాస్ ఫోర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ లైఫ్ సర్టిఫికెట్లు, కదలలేని విశ్రాంతి ఉద్యోగులకు ఇంటి వద్దనే పింఛన్ అందించేందుకు బ్యాంకు మేనేజర్లతో మాట్లాడి ఏర్పాట్లు చేశామన్నారు. గ్రామంలో విశిష్ట సేవలు అందిస్తున్న స్టేట్ బ్యాంక్ మేనేజర్ బి.అరుణ్ కుమార్, జిల్లా అధ్యక్షులు పల్లా సత్యనారాయణ మూర్తి, సీనియర్ పెన్షనర్లు ప్రొఫెసర్ ఐవీ సుబ్బారావు, పి.సూర్యనారాయణశర్మలను ఘనంగా సన్మానించారు. సంఘ కార్యాలయ భవన నిర్మాణానికి సభ్యులు కామేశ్వర శర్మ, విజయ మోహన్, బండారు రవీంద్ర, ఐవి సుబ్బారావు, ప్రసాద్ ఒక్కొక్కరు రూ.1,106 వంతున ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు కామేశ్వర శర్మ, ప్రధాన కార్యదర్శి బండారు రవీంద్ర, విజయ మోహన్, డి.సుబ్బారావు, వెంకటేశ్వర రావు, మహాలక్ష్మీరావు, గుమ్మెల్ల కొండలరావు, అంసూరి సూర్యారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న తిరుకల్యాణం



తిరుకల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న కామిని ప్రసాద్ చౌదరి, లక్ష్మి దంపతులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు వెంకటగిరికొండపై కొలువైన లక్ష్మీ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామివారి 25వ తిరు కల్యాణ మహోత్సవాన్ని సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. కల్యాణ కర్తలుగా ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త కామిని ప్రసాద్ చౌదరి, లక్ష్మి దంపతులు వ్యవహరించారు. శైవగామ పండితుడు సూరిపండు, ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీకృష్ణ పరమాత్మ.. స్వామి వారి కల్యాణాన్ని వేడుకగా జరిపించారు. తొలుత మూలవిరాట్‌కు అభిషేకాలు, అర్చనలు చేశారు. ఈ సందర్భంగా కోలాట నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కల్యాణ మహోత్సవాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ మత్సేటి ప్రసాద్ తదితరులు తిలకించారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

4న క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు

- జాతీయ ప్రధాన కార్యదర్శి రాజు
- రాజమహేంద్రవరంలో పీఎంపీ రాష్ట్ర కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ ప్రధాన కార్యదర్శి రాజు

కంబాలచెరువు: క్షేత్ర స్థాయిలో ప్రజల ఆరోగ్య సంరక్షణలో కీలకమైన పీఎంపీలు ఫిబ్రవరి 4న అన్ని జిల్లాల్లోని మండలాల్లో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కమ్యూనిటీ పారా మెడిక్స్ – ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) జాతీయ ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు అన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఆనంద్ రీజెన్సీ కాన్ఫరెన్స్ హాల్లో రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ ఉపాధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు అధ్యక్షతన అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు మాట్లాడుతూ ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా తప్పనిసరిగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్వహించే ప్రతి ఆరోగ్య కార్యక్రమాలకు తప్పనిసరిగా హాజరవ్వాలని సూచించారు. రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలోని ఎమ్మెల్యేలను కలిసి పీఎంపీల సమస్యలపై విజ్ఞాపన పత్రాలను అందజేయాలని చెప్పారు. రాష్ట్ర కమిటీ తీర్మానం, అసోసియేషన్ విధివిధానాల ప్రకారం కార్యక్రమాల రూపకల్పన చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర జాతీయ, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.జనార్దన్, రాష్ట్ర కోశాధికారి ఎస్.వేణుగోపాల్, రాష్ట్ర ముఖ్య సలహాదారులు ఎన్.జయసూర్య, గౌరవ సలహాదారు కోన చిన్నారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగుమళ్ల రాంబాబు, రాష్ట్ర మీడియా కన్వీనర్, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు బళ్లా శ్రీనివాసరావు, కార్యదర్శి పి.దేవానందం, కాకినాడ జిల్లా అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్, కార్యదర్శి ఎస్కే తానీషా, కోనసీమ జిల్లా కోశాధికారి మట్టా వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

డీమార్ట్‌లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల తనిఖీలు

- కాలం చెల్లిన మజా టెట్రా ప్యాకెట్ల విక్రయం
- బాధితుల ఆందోళన



డీమార్ట్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేటలోని డీమార్ట్‌లో కాలం చెల్లిన మజా టెట్రా ప్యాకెట్లు విక్రయించారంటూ కొనుగోలుదారులు ఆందోళన చేశారు. దీంతో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు డీమార్ట్‌లో తనిఖీలు నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.. హుకుంపేట వరలక్ష్మి కాలనీకి చెందిన నీతిపూడి కిరణ్ కుమార్ ఆదివారం కుటుంబ సభ్యులు, స్నేహితులతో గెట్ టు గెదర్ ఏర్పాటు చేసుకున్నారు. దాని కోసం డీమార్ట్ నుంచి రాత్రి 9.30 గంటల సమయంలో 40 మజా టెట్రా ప్యాకెట్లను కొనుగోలు చేశారు. గెట్ టు గెదర్‌లో ఈ ప్యాకెట్లు తాగిన కొందరికి వాంతులయ్యాయి. సందేహం వచ్చి పరిశీలించగా ప్యాకెట్లపై ఎక్స్‌పైర్ తేదీ ఈనెల 8గా ఉంది. వెంటనే డీమార్ట్‌కి వెంటనే వెళ్లి అడుగగా, పాతస్టాకును మార్చేశారు. దాదాపు గంటన్నర బాధితులను బయట నిలబెట్టారు. డీమార్ట్ మేనేజర్ ఇష్టానుసారంగా మాట్లాడడంతో బాధితులు బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

డీమార్ట్ వద్ద ఆందోళన

సోమవారం ఉదయం కూడా డీమార్ట్ నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో కిరణ్ కుమార్, అతడి స్నేహితులు డీమార్ట్ వద్ద ఆందోళన చేపట్టారు. అక్కడకు చేరుకున్న బొమ్మూరు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ బాధితులతో మాట్లాడారు. ఈలోగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు సుబ్బారావు, సుప్రియ అక్కడకు చేరుకున్నారు. బాధితులు తాము కొనుగోలు చేసిన ప్యాకెట్లు, బిల్లులను చూపించారు. అనంతరం ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు టెట్రా ప్యాకెట్లను, కూల్‌డ్రింక్‌లను తనిఖీ చేశారు. అప్పటికే స్టాక్ మార్చేశారని బాధితులు అధికారులు దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సై రమేష్ డీమార్ట్‌లోని సీసీ పుటేజీని పరిశీలించారు. మజాటెట్రా ప్యాకెట్లు కొనుగోలు చేసినట్లు కనిపించదని, ఆ తరువాత 60 నిమిషాల సీసీ టీవీ పుటేజీ మాయమైంది. దీంతో డీమార్ట్ యాజమాన్యంపై బాధితులకు మరింత అనుమానం ఎక్కువైంది. దీనిపై పూర్తి విచారణ జరిపి తమకు న్యాయం జరపాలని బాధితులు అధికారులను కోరారు. ఈలోగా అక్కడకు చేరుకున్న జిల్లా వినియోగదారుల రక్షణమండలి సభ్యులు జి.అనంతరావు దృష్టికి బాధితులు జరిగిన అన్యాయాన్ని వివరించారు. ఫుడ్ సేఫ్టీ సహాయ సంచాలకులు శ్రీనివాస్ మాట్లాడుతూ బాధితులు ఈ విషయాన్ని ఫుడ్ సేఫ్టీకి చెబితే అధికారులు అక్కడకు వచ్చి వెంటనే తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. వారు ముందుగా వెళ్లడం వలన వెంటనే పాతస్టాక్‌ను మార్చే అవకాశం ఉంటుందన్నారు. డీమార్ట్ తనిఖీలో ఎక్కడా పాతస్టాక్ కనిపించలేదని తెలిపారు. కాగా..నీతుపూడి కిరణ్ కుమార్ సోమవారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీమార్టు సిబ్బందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ తెలిపారు.

వస్త్ర గోడౌన్‌లో అగ్ని ప్రమాదం

కంబాలచెరువు: స్థానిక గణేష్ చౌక్ సమీపంలోని బట్టల గోడౌన్‌లో సోమవారం అగ్ని ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళితే గణేష్ చౌక్ లోని ప్రెస్ క్లబ్ ఎదురుగా నున్న భవనంలో బి.ఆదాముురాజు వస్త్రాలను నిల్వ చేస్తున్నాడు. ఆ గోడౌన్ నుంచి సోమవారం పొగలు రావడాన్ని స్థానికులు గమనించారు. ఈ విషయాన్ని అగ్నిమాపక సిబ్బందికి తెలిపారు. దీంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో గోడౌన్‌లో నిల్వ ఉంచిన దుస్తులు కాలిపోయాయి. సుమారు రూ.2 లక్షల ఆస్తినష్టం జరిగిందని అగ్నిమాపకశాఖాధికారి శ్రీనివాస్ తెలిపారు.

వినూత్న ప్రయత్నాలు ప్రశంసనీయం

రాజమహేంద్రవరం రూరల్: మహిళలను వ్యవసాయ వ్యవస్థాపకులుగా మార్చడంలో గ్రామీణ ఫౌండేషన్ చేస్తున్న వినూత్న ప్రయత్నాలను జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధన సంస్థ(నిర్కా) డైరెక్టర్ డా.మాగంటి శేషుమాధవ్ ప్రశంసించారు. సోమవారం స్థానిక నిర్కా (సిటీఆర్ఐ) సమావే శమందిరంలో గ్రామీణ ఫౌండేషన్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ (జీఎఫ్ఎస్ఐ) గ్రోప్రాజెక్టులో భాగంగా జిల్లాలో 115 మంది మహిళా రైతులకు వ్యవసాయ–వ్యాపా వ్యవస్థాపకులుగా తయారుచేసే క్రమంలో ఏర్పాటు చేసిన నాలుగు రోజుల శిక్షణను ఆయన ప్రారంభించారు. కలవచర్ల కేవీకే హెడ్ డాక్టర్ కేజీఆర్ నాయుడు మాట్లాడుతూ శిక్షణ పొందుతున్న వ్యవసాయ వ్యవస్థాపకులు కేవీకే వద్ద సేంద్రియ వ్యవసాయ డెమో ప్లాట్లను సందర్శించాలన్నారు. జీఎఫ్ఎస్ఐ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ సాకిబ్ ఖాన్ మాట్లాడుతూ వ్యవసాయ వ్యవస్థాపకుల కోసం మొక్కల ఆరోగ్య నిర్వహణ, అధునాతనం జ్ఞానంపై దృష్టిసారించి శిక్షణను ప్రారంభించారమన్నారు.